‘అరుణాచలం’కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

సుభాష్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అరుణాచలం పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని ఆర్‌ఎం జ్యోత్స్న తెలిపారు. నగరంలోని ప్రధాన బస్టాండ్‌లో శుక్రవారం అరుణాచలం బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణాచలం ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు. బస్ స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో పేమెంట్ ద్వారా కూడా రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆర్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవీఎంలు శంకర్, సరస్వతి, డీఎం ఆనంద్, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

• నగరాన్ని కమ్మేసిన పొగమంచు



జిల్లాపై చలి పంజా

● 10 డిగ్రీలకు పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై మళ్లీ చలి పంజా విసురుతోంది. తుఫాన్ కారణంగా 15 రోజులుగా జిల్లాలో చలి తీవ్రత తగ్గగా.. మళ్లీ రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో ప్రజలు చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. సాయంత్రం 6 దాటితే చలి విపరీతంగా పెరుగుతుండటంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత నుంచి బయట పడేందుకు చలిమంట వేసుకుంటున్నారు. రూమ్ హీటర్లు, స్వెటర్లు, మఫ్లర్లను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో శుక్రవారం కోటగిరిలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, పోతంగల్‌లో 10.4, సాలూరాలో 11, గూపన్‌పల్లిలో 11.2, పాల్దాలో 11.5, బెల్లాల్, రుద్రూర్‌లో 11.6, మంచిప్పలో 11.9, నిజామాబాద్‌లో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు రోజుల పాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.



• నగర శివారులో శుక్రవారం ఉదయం పొగమంచు ఇలా..



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నేడు వసతిగృహాల్లో డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు కార్యక్రమం

» కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో శనివారం డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఆయన శుక్రవారం బాల్కొండ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఈ కార్యక్రమంపై వీడియోకాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని వసతిగృహాల్లో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన కోరారు. జిల్లాకు చెందిన ఆర్సీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లకు కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో రెసిడెన్షియల్ గురుకులాల హాస్టళ్ల 40శాతం, డైట్ 200శాతం కాస్మెటిక్ చార్జీలను పెంచారని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖలకు చెందిన అధికారులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్, ఆర్డీవోలు రాజేందర్‌కుమార్, రాజాగౌడ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



‘పంచాయతీ’ ఎన్నికలకు సన్నద్ధం

» ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం

» పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాకు తుది రూపు

» మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. ఆశావహులు గ్రామాల్లో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓటర్లకు దగ్గరయ్యేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారు.

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. వచ్చే రెండునెలల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి సంకేతాలు రావడంతో అధికారులు ఎన్నికల నిర్వాహణ ఏర్పాట్లపై దృష్టిపెట్టారు. ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగానే ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేయగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు సైతం పూర్తి చేశారు. ఈనెల 7న జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ప్రకటించారు. జిల్లాలో మొత్తం 545 గ్రామ పంచాయతీలు ఉండగా 5022 వార్డులకు గాను 5053 పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ ముసాయిదా జాబితాను రూపొందించారు. ఈనెల 12 వరకు గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించారు. ఈనెల 17న అన్ని గ్రామ పంచాయతీలు, మండలాల్లో తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించనున్నారు. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేయగా తాజాగా పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సిద్ధం చేసే పనిలో అధికార యంత్రాంగం ఉంది. బ్యాలెట్ బాక్సులతో పాటు బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో కులగణన చేస్తుండటంతో దానిపై తుది నిర్ణయం తీసుకున్న అనంతరం పంచాయతీ ఎన్నికలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. అధికారుల అంచనా ప్రకారం ఫిబ్రవరి నెలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ రెవెన్యూ డివిజన్‌ల వారీగా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తుది ఏర్పాట్లు చేస్తున్న అధికారులు..

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను ఇప్పటికే జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం పోలింగ్ కేంద్రాలను గ్రామాల వారీగా గుర్తిస్తున్నారు. గ్రామ పంచాయతీలోని వార్డులలో ఉన్న ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు దృష్టిపెట్టారు. బ్యాలెట్ బాక్సులు సైతం పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా సిద్ధం చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న బాక్సులన్నింటినీ జిల్లా కేంద్రానికి తీసుకువస్తున్నారు. స్థానిక గోదాములలో వాటిని నిలువ చేసి మరమ్మతులు చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా కీలకమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణ సైతం అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పంచాయతీలలో ఉన్న ఓటర్ల సంఖ్య, పోటీ చేసే అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బ్యాలెట్ పేపర్లను ముద్రించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాలెట్ పేపర్లను పంచాయతీ అధికారులే అందించనుండగా గుర్తులను మాత్రం ప్రింటింగ్ ప్రెస్‌లలో ముద్రించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌ల వివరాలను అధికారులు ఇప్పటికే సేకరించారు. ఒకటి రెండు రోజుల్లో వాటిని ఖరారు చేయనున్నారు. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా నోటా గుర్తుతో కలిపి బ్యాలెట్ పేపర్లను ముద్రించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణ..

జిల్లాలో పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం షెడ్యూల్ రూపొందిస్తోంది. ఆర్మూర్ డివిజన్, బోధన్ డివిజన్, నిజామాబాద్ డివిజన్‌ల వారీగా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో 180 గ్రామ పంచాయతీలకు గాను 1766 వార్డులకు 1786 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో 152 గ్రామ పంచాయతీలకు గాను 1354 వార్డులలో 1354 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో 213 గ్రామ పంచాయతీలు ఉండగా 1902 వార్డులకు గాను 1913 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మూడు విడతల్లో నిర్వహించనున్న ఎన్నికలకు విడతల వారీగా పోలింగ్ సిబ్బంది ఎంత మంది అవసరమవుతారో అనే దిశగా అధికారులు అంచనా వేసి పోలింగ్ సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు.

రిజర్వేషన్లపై లేని క్లారిటీ..

గ్రామ పంచాయతీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుండగా రిజర్వేషన్ల విషయంలో ఇంకా స్పష్టమైన క్లారిటీ రాలేదు. బీసీ రిజర్వేషన్లను పెంచాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో దాదాపు చివరి దశకు చేరుకోగా డాటా ఎంట్రీ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా బీసీ రిజర్వేషన్లు ఖరారు తర్వాతనే గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తామని ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రభుత్వం రిజర్వేషన్లను కొత్తగా ఖరారు

మిగతా 8వ పేజీలో...



అంక్సాపూర్ సంత మల్లన్న జాతరకు సర్వం సిద్ధం

» ఈనెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం

» 16న జాతర, రథోత్సవం

» గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

7

రూ.లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టులు కూలిపోయాయి

» గత ప్రభుత్వం రూ.లక్ష కోట్ల అప్పు చేసి ఇరిగేషన్ మీద ఖర్చు పెట్టింది

» అయినా ప్రజలకు ఉపయోగపడిందేమీ లేదు

» అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఎస్సారెస్పీలో పుడికతీత పనులు చేపడతాం

» నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి ప్రాజెక్టుకు పూర్వ వైభవం తీసుకువస్తాం

» కాళేశ్వరం నీటిని వాడకుండానే ఈ యేడు అత్యధికంగా ధాన్యం దిగుబడి

» రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు

ముప్కాల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టులు కూలిపోయాయని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు సందర్శన అనంతరం శుక్రవారం ముప్కాల్‌లోని జీరో పాయింట్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో రూ.1.81లక్షల కోట్ల అప్పు చేసి ఇరిగేషన్ మీద ఖర్చు చేసిందన్నారు. అప్పటి ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టినప్పటికీ ప్రజలకు ఉపయోగపడిందేమిలేదని మంత్రి అన్నారు. ఈ సంవత్సరం తమ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.22వేల 500కోట్లను ఇరిగేషన్ మీద ఖర్చు చేయడానికి కేటాయిస్తే అందులో నుంచి రూ.12వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించడానికే సరిపోతుందన్నారు. మిగతా రూ.10వేల కోట్లతో పనులు చేపడుతూ చిన్న ప్రాజెక్టులను అభివృద్ధి చేసి రైతాంగానికి నీరందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 700 ఏఈలను కొత్తగా నియామించామని, 1800 లాస్కర్‌లను పొరుగు సేవల పద్ధతిలో నియమించామని మంత్రి వివరించారు. 112టీఎంసీల నీటిని సామర్థ్యం కలిగిన ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం ప్రస్తుతం 80టీఎంసీలకు పడిపోయిందన్నారు. ప్రపంచ స్థాయి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఎస్సారెస్పీలో పుడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి ప్రాజెక్టుకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. కాళేశ్వరం నీటిని పంటలకు వాడకుండానే ఈ యేడు అత్యధికంగా వరి దిగుబడి సాధించామని మంత్రి పేర్కొన్నారు. సన్నరకం సాగు ప్రోత్సహించడానికి రూ.500 బోనస్ ప్రకటించామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు దేశచరిత్రలోనే విశిష్టత ఉందని, ప్రాజెక్టు సందర్శిం చడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, డాక్టర్ సంజయ్, రాష్ట్ర చైర్మన్‌లు తాహెర్‌బిన్‌హందాన్, మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, బాల్కొండ, ఆర్మూర్‌నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ముత్యాల సునీల్‌కుమార్, వినయ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీని సందర్శించిన మంత్రి ఉత్తకుమార్‌రెడ్డి

మెండోర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టును మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, లక్ష్మీకాంత్‌రావు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు మానాల మోహన్ రెడ్డి, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్‌లతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి హెలికాప్టర్‌లో పోచంపాడ్‌కు చేరుకున్నారు. మంత్రికి ప్రాజెక్టు అధికారులు స్వాగతం పలికారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరించారు. కార్యక్రమంలో సీఈ సుధాకర్, ఎస్ఈ శ్రీనివాసరావు గుప్తా, ఈఈ చక్రపాణి, కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్‌కుమార్, వినయ్‌రెడ్డి, వెల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్, బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు

ఇదీ అంబులెన్సా!?

» అంబులెన్స్ అవతరం ఎత్తిన తాత్కాలిక ఓమిని వ్యాన్

» టీయూకు అంబులెన్స్ లేక విద్యార్థులకు ఇబ్బందులు

» పాడుబడిన వ్యాన్‌నే అంబులెన్స్‌గా ఉపయోగిస్తున్న వర్సిటీ అధికారులు



7

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎడపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎడపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని బోధన్ రూరల్‌లోని చిన్న మావంది, పెగడాపల్లి, ఊట్‌పల్లి, రెంజల్ మండలంలోని రెంజల్, నీలా, ఎడపల్లి మండలంలోని ఎడపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఏర్గట్లలో బోధన్ ఎమ్మెల్యే పర్యటన

ఏర్గట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శనివారం ఏర్గట్ల పర్యటనకు రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమదేవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొననున్నారన్నారు.

గోపాల్ పేట్ హైస్కూలుకు
రూ. లక్ష విలువ గల సామాగ్రి అందజేత



మాట్లాడుతున్న గోపాల్‌పేట్ హైస్కూల్ హెచ్‌ఎం వెంకట్‌రాంరెడ్డి

నాగిరెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోపాల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎల్. శ్రీనివాస్‌కు అమెరికాలో స్థిరపడిన ముత్యపు సందీప్ కుమార్ బంధువు. తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థుల కోసం సహాయం అందజేయాలని హెచ్‌ఎం అభ్యర్థించారు. దీంతో అమెరికాలోని మిన్నెసోట ఏరియా తెలంగాణ అసోసియేషన్ (మాటా) డైరెక్టర్ ముత్యపు సందీప్ కుమార్ తమ సంస్థ ఆధ్వర్యంలో లక్ష రూపాయల విలువ గల పలు వస్తువులను పాఠశాలకు అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి వాటర్ ప్యూరిఫైర్, సైన్స్, మ్యాథ్స్, గేమ్స్ మెటీరియల్‌తో పాటు గ్రంథాలయ పుస్తకాలు, బీరువాలు ఇతర సామగ్రి అందజేసినట్లు ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. దీంతో శుక్రవారం పాఠశాలలో ప్రత్యేక సమా వేశాన్ని ఏర్పాటు చేసి తాగునీటి వాటర్ ప్యూరీ ఫైర్‌ను స్థానిక ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకట్ రా మిరెడ్డి మాట్లాడుతూ విదేశాల్లో ఉండి మన ప్రాంతం విద్యార్థుల కోసం సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాల్తుమ్మెద హైస్కూల్ హెచ్‌ఎం వెంకట్ రాజు, సీఆర్‌పీ రాజు పాల్గొన్నారు.

ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించాలి

మోస్రా,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బోధన్ ఆర్డీవో శ్రీనివాస్ వాహనదారులకు, ట్రాక్టర్ యాజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, రోడ్లపై ట్రాక్టర్ కేజీవీల్స్‌కు పట్టీలు లేకుండా నడిపితే 30వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రోడ్డును కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామాల్లో అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శాంత, ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కొడిచర్లలో 50 ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్

కోటగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో శుక్రవారం 50 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. గ్రామంలోని పోచమ్మ గుడి, ఈరన్న కుంట, పోతంగల్ రహదారిలో సుమారు 50ట్రాక్టర్ల ఇసుక డంప్‌లు ఉన్నట్లు తమకు సమాచారం అందడంతో సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు, ఇళ్ల నిర్మించుకునే వారికి అనుమతి ఇస్తామన్నారు. ట్రాక్టర్‌కు 600రూపాయల చొప్పున డీడీ చెల్లించి ఇసుకను తీసుకోవాలని సూచించారు. ఇసుకను అనుమతులు లేకుండా డంప్‌లు చేసిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఆరా

బీర్కూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై శుక్రవారం కేంద్ర బృందం సభ్యుడు గోపాల్ ఆరా తీశారు. బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయంతో పాటు బీర్కూర్, అన్నారం, దామరంచ, రైతునగర్,బరంగేడ్గి గ్రామ పంచాయతీలకు వెళ్లి నిధుల వినియోగం విషయమై జీపీ కార్యదర్శులతో మాట్లాడారు. నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

బషీరాబాద్‌లో మల్లన్న స్వామి పల్లకీ ఊరేగింపు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులోని దూల గుట్టపై కొలువుదీరిన యాదవులు ఆరాధ్య దైవం మల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవం, జాతరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం యాదవ సంఘాల అధ్వర్యంలో స్వామి వారి పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. యాదవసంఘాల మహిళలు మంగళహారతులతో ముందు నడవగా గ్రామం ప్రధాన వీధుల గుండి మేళతాళాలు మంగవయిదాయ్యల మధ్య స్వామివారిని పల్లకిలో ఊరేగింపు నిర్వహిస్తు దూలగుట్ట పైగల ఆలయానికి చేర్చారు. కాగా సోమవారం స్వామివారి కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో హజరుకావాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గణేష్, కార్యదర్శి దేవన్న ముకేష్, బైకాని మహేష్, చిన్నయ్య, రవ్వన్న, రామకృష్ణ, ఆశన్న, భూమన్న, రాజు, అబ్బాస్, సాగర్, దీక్షాస్వాములు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

బోధన్‌రూరల్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట స్వామి మాదిగ అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పర్గ గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 27న వేల డప్పులు, లక్షల గొంతుకలు హైదరాబాద్ తరలిరావాలన్నారు. రాష్ట్రంలో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు వాటా దక్కేలా రిజర్వేషన్ల వర్గీకరణ చేయాన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలయ్యే వరకు ఎలాంటి నియామకాలు కాని, నూతనంగా నోటిఫికేషన్లు కాని ఇవ్వరాదని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.భూమయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ బోధన్ మండల ఇన్‌చార్జి గోనేవార్ మారుతి, తాడెం అబ్బయ్య, జాదవ్ ఫకీరా నాయక్, విజయ్ కుమార్, రంజిత్, గంగాధర్, విజయ్, అభినాష్, వీరేష్, సాయిలు, లక్ష్మీ, మొగులాబాయి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంసీపలో మొదటి ర్యాంక్
సాధించిన సిబ్బందికి సన్మానం

తాడ్వాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీసీఎంసీఏ పరీక్షల్లో తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించిన నితీష్‌రెడ్డిని శుక్రవారం సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి సిబ్బందితో సన్మానించారు. తాడ్వాయి మండల సొసైటీ సిబ్బంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తాడ్వాయి సిబ్బంది అయినటువంటి ఏనుగు నితీష్ రెడ్డి కోఆపరేటివ్ సొసైటీకి ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహింపజేసే సంస్థ అయిన తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ గన్‌ఫౌండ్రి హైదరాబాద్ వారి ఎనిమిదో బ్యాచ్ డిప్లొమా ఇన్ కోపరేటివ్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్ అప్లికేషన్స్ 2024 సంవత్సరంలో కోర్సుకు 38 మందితో కలిపిన సొసైటీ ఉద్యోగులకి నిర్వహింప చేసినటువంటి డీసీఎంసీఏ కోర్సుకు అప్లై చేసి సీటు పొంది శిక్షణా క్లాసులకు హాజరై తుది పరీక్షలు అక్టోబర్ నెల 2024లో రాసి 12/12/2024 రోజున విడుదల అయిన ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సంపాదించి నటువంటి మా సంఘ సిబ్బంది ఏనుగు నితీష్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ సన్మానం చేశారు. కావున వీరికి సంఘ అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు, సొసైటీ కార్యదర్శి, సిబ్బంది, కోపరేటివ్ యూనియన్ ప్రిన్సిపాల్ డాక్టర్ భూక్య వెంకన్న తెలిపారు.

ఎత్తిపోతల మరమ్మతులకు నిధులివ్వండి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ ఎత్తిపోతల పథకం మరమ్మతులు, నూతన పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన సందర్భంగా మంత్రిని ఎమ్మెల్యే కలిసి నికాల్‌పూర్, మారంపల్లి, తల్వేద, వన్నెల్(కె), ఎత్తిపోతలకు మోటర్‌ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదే విధంగా కాళేశ్వరం ప్యాకేజీలో భాగంగా పైప్‌లైన్ వేయాలని, గుత్ప ఎత్తిపోతల పథకం అదనపు లిఫ్ట్ మునిపల్లి వరకు పొడగించాలని, ఈ లిఫ్ట్ ద్వారా జక్రాన్‌పల్లి మండలంలోని ఐదు గ్రామాలు, మాక్లూర్ మండలంలోని ఎనిమిది గ్రామాలకు లబ్ధిచేకూరుతుందన్నారు. అధిక భాగం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరగా స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అతి త్వరలో నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్


సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మోస్రా,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మోస్రా, చందూర్ మండల కేంద్రాల్లో జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మైనారిటీ గురుకుల పాఠశాలలో, జిల్లా పరిషత్ పాఠశాలలో వంట సామగ్రి, సరుకులు, కూరగాయలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థుల సిలబస్‌పై ముచ్చటించారు. అనంతరం చందూర్ మండలంలోని ఘన్‌పూర్, మోస్రా మండల కేంద్రంలో, గోవూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఇళ్ల సర్వే పకడ్బందిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చందూర్ తహసీల్దార్ శాంత, ఎంపీడీవో నీలావతి, మోస్రా తహసీల్దార్ మారుతి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఆయా గ్రామాల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్‌పీల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెప్మా ఆర్‌పీలు హైదరాబాద్ ఎండీ ఆఫీస్‌కు వెళ్తుండగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మామిడిపల్లిచౌరస్తా వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రతీ ప్రభుత్వ సర్వేలు చేస్తున్నామని, సరియైన గుర్తింపు లేదని, నెలకు రూ.20వేల వేతనం ఇచ్చి తమను ఆదుకోవాలని, గత తొమ్మిది నెలలుగా జీతాలు రాక కుటుంబ పరిసిథతులు అగమ్యగోచరంగా ఉన్నాయని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్‌పీ యూనియన్ అధ్యక్షురాలు అరుణ, మహిపాల్, అన్నపూర్ణ, కల్పన, సత్య, లహరి, జ్యోతి, కవిత, సహస్ర పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పీడీఎస్ బియ్యంను పట్టుకున్నట్టు తెలిసింది. ఐచర్ వాహనంలో భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు తెలిసిన సమాచారం మేరకు అధికారులు దాడులు నిర్వహించి ఐచర్ వాహనంలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఆర్మూర్ -15) విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

గణితం టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో ఎంపిక

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయిలో ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో పాఠశాల విద్యార్థిని రునాఖాతూన్, సాహితిలు మొదటి, రెండో బహుమతులు సాధించగా రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడంతో వారితో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు కవిత, గంగామణి, కురిజామోహిన్, రిజ్వాన, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ రాష్ట్ర బేస్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి రుత్విక్ రాష్ట్ర సీనియర్ బెస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఫిజికల్ డైరెక్టర్ బొజ్జ మల్లేష్‌గౌడ్ తెలిపారు. ఈనెల 11న పట్టణలోని బాలుర స్కూల్‌లో సీనియర్ బెస్‌బాల్ ఎంపిక పోటీల్లో రుత్విక్ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర సీనియర్ బెస్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పుప్పాల లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఘనసన్మానం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో క్రీడాకారులకు ఘనంగా సన్మానం చేశారు. ఈనెల 11, 12తేదీలలో తెలంగాణ యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్ కాలేజీ టోర్నమెంట్‌లలో విద్యార్థిని ఎం.అంజలి అథ్లెటిక్స్‌లో 800మీటర్ల లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో గెలుపొందారు. నిహారిక వాలీబాల్ టీం క్యాప్టెన్‌గా వ్యవహరించి రన్నరప్‌గా నిలిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక విద్యార్థులకు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకన్నస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోనాసమందర్ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీవేంకటేశ్వరస్వామి జాతరా ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ అద్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్వామివారి ఊరేగింపు,స్వస్తిపుణ్యావాచనం, విష్వక్సేనరాధన, అంకురార్పనము, అగ్నిప్రతిష్ట కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ అర్చకులు జే.సుధాకర్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రాజకీయ పార్టీ నాయకులు కమిటీ సభ్యులు ఎల్లయ్య, రాజగంగారాం, దుపల విజయ్ కుమార్, సామ రాజేశ్వర్ రెడ్డి, ఎంసి గౌడ్ పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ

కమ్మర్‌పల్లి, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) : కమ్మర్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం సెర్ప్ సీఈవో జన్మదిన వేడుకల సందర్భంగా పేదలకు నిత్యవసర సరుకులు అందించారు. ఐకేపి సిబ్బంది. రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వాహన అధికారి దివ్యా దేవరాజన్ (ఐఎఎస్) పుట్టిన రోజు సందర్భంగా ఐకేపీ ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కుంట గంగారెడ్డి ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందించారు. కార్యక్రమంలో సీసీలు రవి కుమార్, అలేఖ్య, పిఓలు, ఐకేపి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు అందించాలి

జక్రాన్‌పల్లి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి) గుత్ప లిఫ్ట్ ద్వారా మండలంలోని ఐదు గ్రామాల రైతాంగానికి పంటల సాగుకు లిఫ్ట్ పూర్తి చేసి ఈ లిఫ్ట్ ద్వారా పంటలకు సాగునీరు అందించాలని కోరుతూ శుక్రవారం ఇరిగేషన్, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జక్రాన్‌పల్లి మాజీఎంపీపీ కె.అనంత్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. పోచంపాడ్‌లో ప్రాజెక్టును సందర్శించడానికి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆయన కలిశారు. గ్రామాల రైతులకు పంట సాగు కోసం సాగునీరు అందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని జక్రాన్‌పల్లి మాజీఎంపీపీ కె.అనంత్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలని వినతి

ముప్కాల్ డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) బాల్కొండ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌లను ఏలాంటి రాజకీయ బేషారతులకు పోకుండా పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని మాజీమంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు సందర్శించి సమీక్ష సమావేశానికి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలికి అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 20, 21, 21ఏ ప్యాకేజీ ద్వారా 5800కోట్లతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు ప్రతిపాదించారని, బాల్కొండ నియోజకవర్గంలో 80వేల ఎకరాలు, రూరల్ కింద 29వేల ఎకరాలు, ఆర్మూర్ నియోజకవర్గంలో ఆరు వేల ఎకరాలు ఉన్నాయన్నారు.

బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

వేల్పూర్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఇంగ్లీష్ మీడియంలో వేల్పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన జె.రితిష్ ప్రథమ, పచ్చలనడ్కుడ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.విశ్వతేజ ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే తెలుగు మీడియంలో వేల్పూర్ పాఠశాలకు చెందిన ఆర్.రమేష్ ప్రథమ, లక్కోర ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎస్.అర్వింద్ ద్వితీయస్థానంలో గెలుపొందారు.

'ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలి'

ముప్కాల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించే వసతిగృహాల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రోగ్రాంలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మాంతు అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాల్కొండ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశ నిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే వంద శాతం డైట్ రూ.200, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రారంబోత్సవం అట్టహసంగా ప్రారంభించి విజయవంతం చేశారని సూచించారు.

విద్యార్థులు క్రీడల్లో జాతీయస్థాయికి ఎదగాలి

కమ్మర్‌పల్లి, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం పొందుతు ఉత్తమక్రీడాకారులుగా రాణించాలని జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనాలని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్యఅన్నారు. మూడు రోజుల పాటు కమ్మర్‌పల్లి మినిస్టేడీయంలో నిర్వహించిన సీఎంకప్ క్రీడల విజేతజట్లకు శుక్రవారం బహుమతులు అందజేశారు.

జనావాసాలకు దూరంగా బట్టీలను ఏర్పాటు చేసుకోండి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్ కుమార్

రెంజల్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య ఉన్న పొగాకు బట్టిలను తొలగించి గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కందకుర్తి గ్రామంలో పొగాకు పండించే రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పొగాకు పండించిన రైతులు బట్టిలను గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో పొగాకు కాల్చడం వల్ల ఏర్పడే అనర్థాల గురించి వివరించారు. అలాగే జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల ఆదేశానుసారం గ్రామ ప్రజలు, రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రైతులు తంబాకు ఎండ పెట్టే ప్రక్రియపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల సూచనలు తెలియపర్చడం జరిగిందన్నారు. గ్రామానికి దూరంగా పొగాకు బట్టిలను ఏర్పాటు చేసుకుంటే ప్రజలకు ఇబ్బంది ఉండదన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనకార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఈనెల 16, 17తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న ధర్నా విష యమై మండల విద్యాధికారి రాజగంగారాం వినతిపత్రం అందజేశారు. ధర్నా నిర్వహించే తేదీలలో మధ్యాహ్న భోజనం అందించబోమని తెలిపారు. ఈ విషయం ప్రధానోపాధ్యాయులు గమనించాలని ఆయన కోరారు. అదే విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని, గ్యాస్ సబ్సిడీ అందజేయాలని, ప్రభుత్వమే సరుకును అందజేసి పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయ కులు గుండెటి శంకర్, సుజాత, పద్మ, దేవయాని, స్వరూప, నర్సుబాయి, భూలక్ష్మీ, సత్తెమ్మ, జయ, భవిత తదితరలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ అందించాలి

మోస్రా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎటువంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ, రైతు భరోసా పూర్తిస్థాయిలో చేయాలని ఎకరానికి 7,500 రూపాయలు అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చందూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ శాంతకు బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు రైతులకు పూరిస్థాయిలో రుణమాఫీ చేయలేదు. పైగా ఎన్నికల ప్రచారసభలో చెప్పని షరతులు ఇప్పుడు విధిస్తూ రైతుల రుణాలు మాఫీ చేయట్లేదన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి 7,500 రూపాయలు ఇస్తామని చెప్పి రైతుల వరినాట్లు ప్రారంభమైనప్పటికీ ఇంకా వేయడం లేదన్నారు. వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి విఠల్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ అర్కల సాయరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరెడ్ల నర్సింలు, సీనియర్ నాయకులు శంర్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సాహిత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యోగేశ్వర్ గౌడ్, కృష్ణ మూర్తి, కృష్ణ గౌడ్, బన్నీ రెడ్డి, వడ్ల శంకర్, బాలురెడ్డి, గాండ్ల శ్రీనివాస్, రగోభ సత్యం, సాయిబాబా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

రామారెడ్డి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం రంగంపేట్ గ్రామంలో నారెడ్డి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబానికి రెండు వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్ కొద్ది రోజుల క్రితం చనిపోయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రెండు వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ క్రమంలో రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి స్పం దించి వెంటనే రెండు వేల నగదు సహాయం నారెడ్డి మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరణించిన షేక్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనీఫ్ మహ్మద్, మండల సీనియర్ నాయకులు సురేందర్‌సింగ్, రంగంపేట మాజీ ఉప సర్పంచ్ ఖలీల్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన
బీఆర్‌ఎస్, జాగృతి మండల నాయకులు

బోధన్‌రూరల్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితను శుక్రవారం బోధన్ మండల బీఆర్‌ఎస్, జాగృతి నాయకులు మర్యాద పూర్వకంగా ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ బోధన్ మండల అధ్యక్షులు సంజీవ్ కుమార్, బోధన్ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు భవానీపేట్ శ్రీనివాస్‌లు బోధన్‌లో రాజకీయ పరిణామాలను ఆమెతో చర్చించారు. ఈ కార్యక్రమంలో భవానీపేట్ శ్రీనివాస్, జాగృతి నాయకులు అల్లడి దేవ, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు షాకీర్ పటేల్, కొప్పర్గ రాములు, పెంటాకలాన్ రవి, ఖండ్‌గాం రాములు, సృజన్ కుమార్ పాల్గొన్నారు.

లింగమయ్య గుట్ట ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

నవీపేట,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయం 5వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన శుక్రవారం గణపతి పూజ, పుణ్యవచనం, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్ని ప్రతిష్ట, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమం, శివ లింగాభిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఆదివారం ముగియనున్నాయి.

ఒకరి రిమాండ్

నవీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ ఏరియాకు చెందిన రమేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 9న రాత్రి యాదగిరి అతని బావ రమేష్ కుటుంబాల మధ్యన గొడవ జరగగా ఇందులో ఇద్దరికి గాయాలు కాగా ఏడుగురిపై కేసు నమోదు అయిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి రమేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

యోగా కేంద్రాన్ని ప్రారంభించిన మెడికల్ ఆఫీసర్

మోస్రా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మించిన యోగా కేంద్రాన్ని శుక్రవారం మండల మాజీ జడ్పీటీసీ గుత్పభాస్కర్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా చేయడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. మండల ప్రజలు యోగా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయుష్ ఆయుర్వేద వైద్యులు, పతంజలి జిల్లా నాయకులు, యోగా టీచర్ ప్రవీణ్‌కుమార్, గ్రామ పెద్దలు పోతురెడ్డి, సూరె సాయిలు, సుదర్శన్ గౌడ్, భూపాల్ రెడ్డి, యోగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి బయోసైన్స్
ప్రతిభ పోటీ పరీక్ష పత్రాల విడుదల

రెంజల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మండల స్థాయి ప్రతిభ పోటీ పరీక్ష పత్రాలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు విడుదల చేశారు. ప్రతి సంవత్సరం టీబీఎస్‌ఎఫ్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పరీక్షలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు శేఖర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, జీవశాస్త్రం ఉపాధ్యాయులు సాయన్న, భూమయప్ప, రవీందర్, మాణిక్యం, గంగాధర్, చంద్రకళ, షబానా, నజీం ఉన్నీసా పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో
రాష్ట్ర ప్రభుత్వం విఫలం : వెంకటేశ్వర్లు

బోధన్‌రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆరోపించారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిన ఆరు గ్యారంటీలను అమలు పర్చలేనందుకు ఆరు గ్యారంటీలు, 66మోసాలను చూపించి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటో నడిపే వారికి సంవత్సరానికి 12వేలు ఇస్తామని, ఫ్రీ బస్సులు పెట్టి ఆటో వాళ్ల కడుపు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మహిళకు 2500రూపాయల ఆర్థిక సహయం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు అని చెప్పి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నర్సింహ రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్, మాజీ జడ్పీటీసీ మేక విజయ సంతోష్, వివిధ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, సరిన్, మనోహర్, గోపికృష్ణ, ఇంద్రకరణ్, ప్రవీణ్, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.


వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

వర్ని,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కల్పనా కుమారి మాట్లాడుతూ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహిస్తూ రాబోయే వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణ, మంగమ్మ, వినోద్ కుమార్, షహీముద్దీన్, విష్ణువర్ధన్, సతీష్ కుమార్, తిరుమలా దేవి, అశ్విని, అజ్మతున్నీసా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

బోధన్‌రూరల్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, హెచ్ఐవీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రి ఆర్‌సీపీసీ కౌన్సిలర్ రాజన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు పోయి అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలన్నారు. ఆరోగ్య సంరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్‌ఆర్‌సీ కౌన్సిలర్ రాజశేఖర్, స్నేహ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోకస్



నాణ్యతకు తిలోదకాలు!

- లింగంపేటలో బురదలోనే కాలువ నిర్మాణ పనులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- రూ.49 లక్షలు వృథా చేస్తున్నారని రైతుల ఆగ్రహం

లింగంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండల కేంద్రంలోని మత్తడి కాలువ నిర్మాణ పనులు నాణ్యత లేకుండా చేపడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మత్తడి కాలువ చెడిపోవడంతో నీరు రాలేదు. ఫలితంగా దానిపై ఆధారపడిఉన్న చీరపేండ్ల కుంటలోకి నీరు అందక పంటలు సాగు అసాధ్యమైంది. ఇన్నాళ్లు తమ సమస్యలు ఎవరూ పట్టించుకోలేదని రైతులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ సహకారంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను కలిసి సమస్యను వివరించారు. వెంటనే స్పందించి ఆయన కాలువ నిర్మాణం కోసం రూ.49 లక్షలు మంజూరు చేశారు. నీటి పారుదల శాఖ అధికారులు కాలువ నిర్మాణం కోసం టెండర్లు పిలిచి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మాణ పనులతోపాటు కాలువ నిర్మాణ పనులను చేపడుతున్నారు. కాలువ గ్రామ సమీపం గుండా వెళ్లడంతో కాలువలోకి గ్రామానికి చెందిన మురికినీరు, బురద నీరు కాలువలోకి చేరుతోంది. సదరు కాంట్రాక్టర్ కల్వర్టుల నిర్మాణంలోనూ, సైడ్‌వాల్స్ నిర్మాణంలోనూ బురదను తొలగించ కుండా బురదలోనే కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నాడు. సైడ్ వాల్స్‌కు ఎలాంటి బెడ్ వేయకుండా, కనీసం ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా బురదలోనే పనులు చేపట్టడం పట్ల గ్రామ రైతులు కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రూ.49లక్షలు బురదలో వేస్తున్నారని, ప్రజా సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని మాజీ ఎంపీపీ ముదాం సాయిలుతో పాటు రైతుల ఏతఃతఃపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ బెడ్ వేసి సైడ్‌వాల్స్ నిర్మించాల్సి ఉం డగా ఎలాంటి బెడ్‌వేయకుండానే సైడ్‌వాల్స్ నిర్మిస్తున్నారని తెలియజేశారు. ఇరిగేషన్ అధికారులు తమకు ఎందుకు అన్నట్లుగా పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పనులు నాణ్యతగా చేపెట్టేవిధంగా చూడాలని వారు కోరుతున్నారు. పాతిక సంవత్సరాలుగా మరమ్మత్తులకు నోచుకోని మత్తడి కాలువ ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరైతే అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైనాణ్యత లేని పనులు చేస్తున్న చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులను నాణ్యతగా చేపట్టకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

పనులు నాణ్యతగా చేయిస్తాం

● మనోహర్ రెడ్డి డీఈఈ

మండలకేంద్రంలో చేపడుతున్న మత్తడి కాలువ, కల్వర్టుల నిర్మాణ పనులను నాణ్యతతోనే చేపట్టేలా చూస్తాం. బురద మట్టిలో చేస్తున్న పనులను పర్యవేక్షించి అలా జరగకుండా చర్యలు చేపడతాం.



పెద్దతడుగూర్‌లో అయ్యప్ప మెట్ల పూజ నిర్వహిస్తున్న స్వాములు

ఓంఓం అయ్యప్ప..

- శరణు ఘోషతో మార్మోగిన పెద్దతడుగూర్
- కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ
- తరలివచ్చిన భక్తజనం

మద్నూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓంఓం అయ్యప్ప.. శరణు ఘోషతో పెద్దతడుగూర్ మారుమోగింది. శబరిమలై సన్నిధానం తరహాలో మండలంలోని పెద్దతడుగూరు గ్రామంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా జరుపుకున్నారు. అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి శరణుఘోష వినిపించారు. పెద్దతడుగూర్ మండల పూజ మహోత్సవాలలో భాగంగా గురుస్వామి వినయ్ ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ క్రమంలో కళాకారులు కలి, హనుమంతుడు, శ్రీరాముని, వేషధారణతో భక్తులను అలరించారు, కళాకారుల డప్పుచప్పుల మధ్య అయ్యప్పలు నృత్యాలుచేశారు. కళాకారుల విన్యాసాలు మాలాధారులు నృత్యాలతో పెద్దతడుగు కేంద్రం ఆధ్యాత్మికతతో వెల్లి విరిసింది. అయ్యప్ప విగ్రహాన్ని మెట్లపై ప్రతిష్ఠించి పాలు, పెరుగు, నెయ్యి, విభూది, పంచదార, చందనం, పసుపు, పండ్లు, తేనె, జలంతో, అభిషేకం చేశారు. అభిషేక సమయములో ఆ ప్రాంతంలో భక్తులు శరణం అయ్యప్ప అంటూ వేడుకున్నారు. అభిషేక పూజల అనంతరం స్వామికి ధూప, దీప నైవేద్యం సమర్పించడంతో వేడుక ముగిసింది. ఈ వేడుక సందర్భముగా గురుస్వామి మహా పాదయాత్ర పూర్తిచేసుకుని పెద్దతడుగుర్‌కు చేరుకున్నారు. పడిపూజకు వచ్చిన భక్తుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని, దీక్ష సమయంలోనే కాకుండా దీక్షలేని సమయంలో కూడా పరోపకార సేవ చేస్తూ దైవభక్తి కలిగి ఉండటం వల్ల ఆధ్యాత్మికత మరింత పెరుగుతుందని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మాల వేసుకున్న స్వాములు ప్రజలకు భక్తిభావం పెరిగే విధంగా ఉపదే శాలు ఇవ్వాలని సూచించారు. మాలధారులకు మహాఅన్న ప్రసాదం అందించారు.

బీర్కూర్‌లో మహాపడిపూజ

బీర్కూర్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి సంకీర్తనలు, భజనలు అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి పల్లకీ సేవ నిర్వహించారు.

కన్నులపండువగా మహా పడిపూజ

భిక్కనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వామియే శరణమయ్యప్ప అంటూ వందలాది అయ్యప్పస్వాముల శరణుఘోషతో భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామం మార్మోగింది. శుక్రవారం రాత్రి తిప్పాపూర్ గ్రామంలోని రెడ్డిఫంక్షన్‌హాల్‌లో వీరమల్లి శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో గురుస్వాములు సుబ్బారావు, కన్నయ్యవంతులు, ఉదయ్‌గురుస్వామి మంత్రోచ్చరణల నడుమ 18వ మహాపడిపూజ కార్యక్రమాన్ని కన్నుపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరటిబోదెలతో అందంగా కోవెలను తయారుచేసి, కోవెలను తీరొక్కపూలతో అందంగా అలంకరించి కోవెలలో అయ్యప్పస్వామితో పాటుగా గణపతి, కుమారస్వామి విగ్రహాలను పెట్టి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, పూలాభిషేకం, మెట్లపూజను నిర్వహించారు. అంతకుముందుగా గ్రామంలోని ప్రధానవీధుల గుండా ప్రత్యేక వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను నిర్వహించారు. భజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



బీర్కూర్‌లో మహా పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు



తిప్పాపూర్‌లో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

ఇదీ అంబులెన్సా!?

- అంబులెన్స్ అవతరం ఎత్తిన తాత్కాలిక ఓమిని వ్యాన్
- టీయూకు అంబులెన్స్‌కు లేక ఇబ్బందులు
- పాడుబడిన వ్యాన్‌నే అంబులెన్స్‌గా ఉపయోగిస్తున్న వర్సిటీ అధికారులు



టీయూలో అంబులెన్స్‌గా వినియోగిస్తున్న వాహనం ఇదే..

డిచ్‌పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీకి అంబులెన్స్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులు అనారోగ్యానికి గురైన సమయంలో ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ లేక తాత్కాలికంగా పాడుబడిన ఓ వ్యాన్‌ను ఉపయోగిస్తున్నారు. ఆ పురాతన వ్యాన్ సైతం కొన్ని సందర్భాలలో మార్గంమధ్యలో నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ వ్యాన్‌లో కనీసం స్ట్రేచర్, ఆక్సిజన్ కిట్, ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్‌కిట్ లాంటివి దానిలో మచ్చుకు కనబడవు. కానీ దాన్ని అంబులెన్స్‌గా ఉపయోగిస్తున్నారు. వర్సిటీలో విద్యార్థులు అర్ధరాత్రి సమయాల్లో ఏదైనా అనారోగ్యానికి గురైతే కనీసం వర్సిటీలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేక విద్యార్థులు డిచ్‌పల్లి మండల కేంద్రం, లేదా, నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆపత్కాలంలో ఉండాల్సిన అంబులెన్స్ లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న వైస్‌చాన్స్‌లర్ యాదగిరి రావు నూతన అంబులెన్స్ అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఘటనలు జరగకుండానే చర్యలు చేపట్టాలని విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు కోరుతున్నారు.



లక్ష్మీదేవునిపల్లి గ్రామ రోడ్డుపై వేసిన కంకర

బీటీ పనులు పూర్తయ్యేనా?

- లక్ష్మీదేవునిపల్లి - గొట్టిముక్కుల రోడ్డుపై కంకర వేసి వదిలేసిన వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

భిక్కనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రం నుంచి దోమకొండ మండలకేంద్రం కేంద్రం నుండి లక్ష్మీదేవునిపల్లి, గొట్టిముక్కుల మీదుగా చేపడుతున్న బీటీరోడ్డు పనులు ఆలస్యంగా జరుగతున్నాయి. ఈ రోడ్డుపై ప్రస్తుతం కంకర వేసి వదిలేయ్యడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో వ్యవసాయబావుల వద్దకు వెళ్లాలంటే ఈ కంకర కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులను వేగంగా పనులను పూర్తి చేయాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై వేసి ఉన్న కంకర ఇలా..

అంక్సాపూర్ సంత మల్లన్న

జాతరకు సర్వం సిద్ధం

- ఈనెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 16న జాతర, రథోత్సవం

వేల్పూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని అత్యంత ప్రాచూర్యం పొందిన దేవాలయాల్లో ఒకటిగా నిలిచిన వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామ సంత మల్లన్న జాతర ఉత్సవాలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ పనుల్లో ఎప్పుడు బిజీబిజీగా ఉండే అంక్సాపూర్ గ్రామప్రజలు సంతమల్లన్న దేవుడిని కొలిచేందుకు వారం రోజులు కేటాయిస్తారు. మొక్కులు తీర్చే దేవుడిగా పేరొందిన సంతమల్లన్నకు ఏడాదిపాటు భక్తులు తమ దీక్షలను కొనసాగిస్తుంటారు. ఈనెల 16న జరిగే జాతర, రథోత్సవాలకు డివిజన్‌లోని మండలాలకు చెందిన ప్రజలే కాకుండా కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఎద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. అంక్సాపూర్ గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయ తోటల మధ్య ఎత్తైన కొండపై వెలిచిన సంతమల్లన్న ఆలయంలో శివలింగాలు కొలువై ఉన్నప్పటికీ ఇక్కడి ప్రాంత ప్రజలు సంతమల్లన్న దేవునిగానే పిలుస్తుంటారు. అంక్సాపూర్ గ్రామ ఆచారం ప్రకారం ఉత్సవ మూర్తులను, సంతమల్లన్న విగ్రహాలను ఆదివారం పల్లకీలో ఆగ్గోల్ల సహాయంతో నగర డోలును మోగించుకుంటూ సంత మల్లన్న గుడి వద్దకు తీసుకువెళ్తారు. అలాగే వీరితో పాటు బంతిపవ్వులతో అలంకరించిన షిడే (రథం) గుట్ట వద్దకు తీసుకువెళ్తారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కాలినడకన పల్లకిలో విగ్రహ ప్రతిమలను ప్రవితగోదావరి నదిలో స్నానం కోసం చిట్టాపూర్ గ్రామానికి డప్పువాయిద్యాలతో తీసుకువెళ్లారు. ఆ రాత్రి అక్కడే బస చేసి శనివారం గోదావరి స్నానం పూర్తి కాగానే తిరిగి బయలుదేరి రాత్రికి అంక్సాపూర్ గ్రామానికి చేరుకుంటారు. ఈనెల 15న (ఆదివారం) సంతమల్లన్న కల్యాణ మహోత్సవం, 16న (సోమవారం) జాతర రథోత్సవం నిర్వహిస్తారు. 17న (మంగళవారం) వివిధ డివిజన్‌లకు చెందిన గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో భక్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు ఆటోలపై సంతమల్లన్న గుట్ట వద్దకు వచ్చి మొక్కులు చెల్లిస్తారు. ఇందులో భాగంగా భక్తులు బోనాలు వేస్తూ ఐదు రకాల ధాన్యాలను ఒక చోట వేసి వాటిపై ఉడికించిన నైవేద్యాలను సంత మల్లన్న దేవునికి సమర్పిస్తూ మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆదీనంలో తీసుకున్నప్పటికీ అంక్సాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఈ జాతర ఉత్సవాల ఏర్పాట్లను ప్రత్యక్షంగా నిర్వహించడం విశేషం. అంక్సాపూర్ నుంచి సంతమల్లన్న ఆలయం వరకు బీటీరోడ్డు, గుట్ట చుట్టు రథం, తింపడానికి సీసీ రోడ్డు, ఇటీవలే ఆలయం భూమి విస్తీర్ణం చుట్టూ బీటీ రోడ్డు నిర్మించారు. ధర్మశాలలు, విశ్రాంతి గదులు, గుట్టపైన, కింద మంచినీటి ట్యాంకులను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.



జాతరకు ముస్తాబైన సంతమల్లన్న ఆలయం



సంత మల్లన్న ఆలయానికి ఏర్పాటు చేసిన మెట్లు

ఆలయ స్థలపురాణం

ఈ దేవాలయం గత దశబ్దాన్నర క్రితం వెలిసిందని చెబుతున్నారు. అప్పట్లో ఈ ఆలయం ప్రాంతం చుట్టు దట్టమైన ఆడవి ఉండేది. ఈ అడవిలో సాదువులు, సంతులు తపోసిద్ధికై కఠోర తపస్సు చేసేవారు. ఈ అడవిలో ఎక్కువగా పశువులు మేత మేయడానికి వెళ్లేవి. అనుకోకుండా ఈ ప్రాంతంలో వ్యాధులు సోకి పశువులు చనిపోయాయి. దీంతో తీవ్ర ఆవేదనతో కుమిలిపోయిన పశువుల కాపారులు ఈ అడవిలో తపస్సు చేస్తున్న సాధు, సంతులను వేడుకోగా వారు అనుగ్రహించి గుట్టపై కొలువై ఉన్న మల్లన్న దేవున్ని పూజిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని కాపారులకు చెప్పి సదుసంతులు అదృశ్యమయ్యారని ఈ ప్రాంత పురాణం తెలుపుతోంది. ఈ దేవాయాన్ని సదు సంతులు ఏర్పాటు చేశారన్న భవంతో ఆనాటి నుంచి ఈ దేవాలయాన్ని మల్లన్న దేవునికి బదులుగా సంత మల్లన్న దేవాలయంగా పిలుస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలకు, పువులకు ఏలాంటి వ్యాధులు సోకిన సంత మల్లన్నకు నైవేద్యాలు సమర్పించుకుంటారు. ఇలా చేస్తే వ్యాధులు గాని ఇతర అపదలు రావని, వచ్చిన తొలగిపోతాయని ఇక్కడి వారికి గట్టి నమ్మకం.



అంక్సాపూర్ సంత మల్లన్న ఆలయ ముఖద్వారం

అంబేద్కర్ యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం, పీజీ ద్వితీయ సంవత్సరం ట్యూషన్ ఫీజు రెన్యువల్ చేసుకోవడానికి గడువును డిసెంబర్ 28 వరకు పొడగించినట్లు రీజినల్ కో-ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని గ్రూప్-2 పరీక్షల కారణంగా రెండో శనివారం, ఆదివారం నిర్వహించే డిగ్రీ, పీజీ తరగతులను వాయిదా వేస్తున్నట్లు విద్యార్థులు గమనించాలని ఆమె తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

డిచ్‌పల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీలకు ఇందల్వాయికి చెందిన శ్రీకర్ ఎంపికైనట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధుసుదన్ రెడ్డి, వినోద్ లు తెలిపారు. ఈ నెల 13నుంచి 15 వరకు మహబూబాబాద్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని ఎస్‌ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో శ్రీకర్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నడని, తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీకర్ మంచి ప్రతిభ కనబర్చాలని సాఫ్ట్‌బాల్ కార్యదర్శి మర్కంటి గంగామోహన్, పీడీ సంజీవ్, కోచ్ నాగేశ్‌లు తెలిపారు.

ధర్మారం శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

డిచ్‌పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం నుంచి మెంట్రాజ్‌పల్లి వెళ్లే దారి పక్కన 45 ఏళ్ల గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. మృతుని చేయి పై నీతా రమేశ్ గవాతే నాందేడ్(కొండిబా) అని పచ్చ బొట్టుతో రాసి ఉందని , ఎస్సై తెలిపారు. మృతుడు బ్లాక్ అండ్ వైట్ గీతల గల చొక్క ధరించి ఉన్నాడని, మృతుడిని ఎవరైనా గుర్తించినచో డిచ్‌పల్లి ఎస్సై 87126 59852, సీఐ 87126 59851 నంబరుకు సంప్రదించాలని కోరారు.

'గో సంరక్షణ అందరి బాధ్యత'



డిచ్‌పల్లికి చేరుకున్న స్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

డిచ్‌పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గోమాత సంరక్షణ అందరి బాధ్యత అని ప్రతిఒక్కరూ గోమాత అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీకృష్ణ మహరాజ్ స్వామి భక్తులకు ఉపదేశించారు. శుక్రవారం సాయంత్రం కాశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు గోమాతను వెంట బెట్టుకొని పాదయాత్రగా వెళ్తున్న కృష్ణ మహరాజ్ డిచ్‌పల్లి స్పటిక లింగేశ్వర ఆలయం వద్ద భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఉన్న ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలను డీఐఈవో రవికుమార్ శుక్ర వారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటర్ బోర్డు రూపొందించిన నియమనిబం ధనల ప్రకారం ఫైళ్ల నిర్వహణ ఉండాలని ఆయన సూచించారు. కళాశాలలోని తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలకు అవకా శం లేకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రిజిస్టర్‌లను సక్రమం గా ఉండేలా చూడాలని విద్యార్థుల డేటాను సరిచేసుకునేందుకు, సబ్జెక్టులు మార్చుకునేందుకు, ఫొటో, సంతకం సరిదిద్దుకోవడానికి అవకాశం ఇచ్చినందున డేటాను సరిచేసి పంపాలన్నారు. కళాశాలలోని తరగతి గదులను, ప్రయోగ శాలను పరిశీలించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల మానవహారం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరి ష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు ఏడోరోజు నిరసనలో భాగంగా శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటతప్పనని సమగ్ర శిక్షా ఉద్యోగులకు హన్మ కొండలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని ఉద్యోగుల సంఘం అధ్య క్షుడు రాజు కోరారు. వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. పాత కలెక్టరేట్ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు భూపేందర్, విజయ్, ప్రసాద్, రాజు, గంగామణి, సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.

మద్దుల్ లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ధర్పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర శివారులో గల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యా యి. శనివారం జరిగే ఉత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ధర్పల్లి మండలంతో పాటు సిరికొండ, ఇందల్వాయి, డిచ్‌పల్లి మండ లాలకు చెందిన భక్తులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఇక్కడ గల నర్సిం హస్వామి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఇటీవల మండలంలో పర్యటించిన ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి గాను తన సొంత డబ్బులు రూ.5లక్షలు అందజేశారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆలయ కమిటీ చర్యలు ప్రారంభించింది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ తెలిపింది.

వైభవంగా దత్త జయంతి ఉత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన దేవస్థానమైన నగరంలోని గాజుల్‌పేట్ లోగల సంత్ ఆచార్య మఠంలో దత్త జయంతి ఉత్స వాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దత్త మూల విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన స్థాపిత దేవతలకు వేదపండితులు యోగేష్‌శర్మ వేదమంత్రాలు పఠించగా అర్చకులు మనోహర్ మహరాజ్, మాధవ్‌లు పూజ లు చేశారు. పండితులు దత్తపారాయణం నిర్వహించి ఆలయ వీధులగుండా దత్త పాదుకలను, దత్త గ్రంథంను పల్లకిసేవలో ఉంచి ఊరేగించారు. ఈ కార్య క్రమంలో యోగేష్, మారుతీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అవధూత జయంతి..

దత్త జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం అవధూత జయంతిని నిర్వ హించనున్నారు. జయంతిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నగర పుర వీధుల గుండా భక్తుల భజనలతో శోభాయాత్రను జరుపనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులతో పారాయణం, దత్త జీవిత చరిత్రపై ప్రవచనాలు జరుగనున్నాయి.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

సుభాష్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగరటౌన్-1 ఏడీఈ చంద్ర శేఖర్, టౌన్-2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. నగరంలోని సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం తొమ్మిది గంటల నుం చి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. నగరంలోని ఖలీల్‌వాడీ, ఎల్లమ్మగుట్ట, పోలీస్‌లైన్, పోచమ్మ గల్లి, ప్రగతినగర్, గాంధీచౌక్, కుమార్‌గల్లి, కసాబ్‌గల్లీ, ఆజామ్‌రోడ్, వీక్లీమార్కెట్, బస్టాండ్‌రోడ్, రైల్వేస్టేషన్ రోడ్, హమాల్‌వాడి, సుభాష్ నగర్, బ్యాంక్‌కాలనీ, గంగాస్థాన్, కేసీఆర్ కాలనీ, విద్యుత్‌నగర్, హౌజిం గ్‌బోర్డు కాలనీ, తారకరాంనగర్, మారుతినగర్, రోడక హనుమాన్, నీలకంఠేశ్వర్ కాలనీ, గణేష్‌నగర్, కస్తూరీ గార్డెన్, ఆర్యనగర్ ఫీడర్ పరిధి లో ఉదయం 9.30ల నుంచి 12గంటల వరకు సాయికృపనగర్, పంచ ముకి హనుమాన్‌రోడ్, దత్తాత్రేయ టెంపుల్ ప్రాంతం, తుల్జాభవాని టెంపుల్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు అపార్ట్‌మెంట్‌దే

● ఆర్‌కేఆర్ అపార్ట్‌మెంట్ వాసులు



సమావేశంలో మాట్లాడుతున్న అపార్ట్‌మెంట్ వాసులు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసేముందు చూపించిన రోడ్డు మార్గం తమకు ఇవ్వాల్సిం దేనని ఆర్‌కేఆర్ అపార్ట్‌మెంట్ వాసులు అన్నారు. అపార్ట్‌మెంట్ ప్లాట్లు కొనుగోలుకు ముందు చెప్పినవి ఒకటని, తర్వాత మరో విధంగా మాట్లా డుతున్నారని, దారి ఉందని తమను నమ్మించి మోసం చేసి రోడ్డుపై పడేశారని ఆర్‌కెఆర్ అపార్ట్‌మెంట్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆర్‌కేఆర్ అపార్ట్‌మెంట్ వాసులు విలేకరుల సమావేశం నిర్వహించారు. నగరంలోని బైపాస్ రోడ్‌లోగల తమ అపార్ట్‌మెంట్‌కు బైపాస్ రోడ్డు నుంచి దారి ఉందని నమ్మించి అపార్ట్‌మెంట్‌లోని ప్లాట్లు అమ్మి బిల్డర్ మోసం చేశాడన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మామ రాంకిషన్‌రావు తన అనుచర బలగంతో బెదిరి స్తూ అపార్ట్‌మెంట్ వైపు ఉన్న ప్రధాన గేటు రోడ్డును కబ్జా చేస్తున్నారని ఇదేమిటని ప్రశ్నిస్తే అపార్ట్‌మెంట్ నివాసితులపై దాడులకు దిగుతున్నారని అన్నారు. నగేష్ అనే వ్యక్తితో ప్రెస్‌మీట్ పెట్టించి ఇది వ్యక్తిగత విషయమని ఇందులో ఎమ్మెల్సీ కవితకు, వారి కుటుంబ సభ్యులకు సంబంధం లేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. నగేష్ చూపెట్టిన డాక్యు మెంట్లలో రాంకిషన్‌రావుతో పాటు కొడుకు అరుణ్, మరో ముగ్గురు ఉన్నట్లు ఆధారాలున్నాయన్నారు. రోడ్డు ఉందని నమ్మించి నాణ్యత లేకుండా అపార్ట్‌మెంట్ నిర్మించి తమకు అప్పగించిన బిల్డర్స్‌పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగైదు సంవత్సరాల క్రితం ప్లాట్లు కొనుగోలు చేసి ఉంటున్నామని, కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి విషయాలు చెప్పకుండా ఇప్పుడు ఓ గేటు నుంచే వెళ్లాలంటే ఇబ్బం దులు ఎదురవుతున్నాయన్నారు. బైపాస్ రోడ్డు నుంచి ఉన్న రోడ్డును మూసివేసేందుకు రాంకిషన్‌రావు అనుచరులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. అపార్ట్‌మెంట్ వాసుల తరపున వెళ్లి అడిగేందుకు ప్రయత్నిస్తే గోపి అనే వ్యక్తి కొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్లాట్లు అమ్మేటప్పుడు పక్కనే ఉన్న రాంకిషన్‌రావు ఇప్పుడు మాటమార్చి భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. రాంకిషన్‌రావుపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వీరికి కాం గ్రెస్ నాయకుడు ఆదెప్రవీణ్ సంఘీబావం తెలిపారు. విలేకరుల సమా వేశంలో అపార్ట్‌మెంట్ వాసులు వెల్మల్ గోపి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఫ్యామిలీ కార్డు ఆవిష్కరణ



కార్డును ఆవిష్కరిస్తున్న నిజామాబాద్ ఏసీపీ

ఖిల్లా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ ప్రాథమిక హక్కు అని నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజా వెంకట్‌రెడ్డి అన్నారు. మెడికవర్ ఆసుపత్రి వారి మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డును శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికవర్డ్ కార్డు సామాన్యులకు చేరువయ్యేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఆర్థిక స్థోమత గురించి చింతించకుండా కుటుంబ సంరక్షణను ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే దిశగా ఈ ఫ్యామిలీ కార్డు ఉపయోగప డుతుందన్నారు. అనంతరం మెడికవర్డ్ సెంటర్ హెడ్ స్వామి మాట్లాడుతూ విశ్వసనీయ ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్న మెడికవర్ ఆసుపత్రులు ప్రస్తుతం మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డుతో మా రోగులతో బంధాన్ని బలో పేతం చేయడానికి అత్యాధునికరమైన పరికరాలతో సదుపాయాలతో అనుభవజ్ఞులైన వైద్యులతో ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలను విస్తరించడానికి కృషి చేస్తుందన్నారు. 23 మెడి కవర్ ఆసుపత్రుల్లో ఓపి కన్సల్టేషన్‌పై 30 శాతం తగ్గింపు, ఓపీడీ పరిశోధనలపై 15 శాతం, ఇన్‌పేషెంట్ డేకేర్ సేవలపై 10 శాతం తగ్గింపు, ఫార్మసీ వినియోగవస్తువులు మిన హా 50 శాతం తగ్గింపు వర్తిస్తుందని తెలి పారు. మా కార్పొరేట్ అడ్మిషన్‌ల కోసం వైద్యే తర సేవలపై ఉచిత అంబులెన్స్ పికప్ డ్రాప్ 10 కిలోమీటర్ల లోపు హోమ్‌కేర్ సేవల పై 30 శాతం తగ్గింపు, 5వేల కంటే ఎక్కువ బిల్లుకు ఫార్మసీలో 20 శాతం తగ్గింపు, హెల్త్ చెకప్‌పై 10 శాతం తగ్గింపు ఇవ్వనున్నట్లు తెలిపారు. మెడికవర్‌లో ఖర్చుచేసే ప్రతీ వెయ్యికి ఒక్కో పాయింట్‌కు ఒక్క రూపాయి చొప్పున రీడింగ్ చేసుకోగలిగే ఫ్యామిలీ రివార్డులను అందిస్తుందని తెలిపారు. లబ్ధిదారులు పేరు, వయస్సు, చిరునామా, ఫోన్‌నెంబర్, బ్లడ్ గ్రూప్ వంటి వివరాలను అందించడం ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ కార్డు వెంటనే వాట్సాప్ ద్వారా జారీ చేయబడుతుందన్నారు.

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

డొంకేశ్వర్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలం తొం డాకూర్ కుద్వాన్‌పూర్ గ్రామాల మధ్య బ్రిడ్జిని అనుకొని ఉన్న విద్యుత్ తీగలను విద్యుత్ శాఖ అధికారులు సరి చేశారు. ఈనెల 1న ఆంధ్రజ్యోతి లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు పొంచి ఉన్న ప్రమాదం అనే కథనంపై విద్యుత్ సిబ్బంది స్పందించారు. 11 మీటర్ల ఎత్తు స్తంభాలు వేసి సరి చేశారు. రైతులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి

ఏర్గట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదా రుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం పూర్తికానుందని మండల ఎంపీడీవో శివచరణ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గుమ్మిర్యాల్‌లో గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఇందిరమ్మ ఆప్‌లో ఎప్పటి కప్పుడు నమోదు చేస్తున్నామన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

సుభాష్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో విద్యుత్‌ను ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందని, వెంటనే విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని విద్యుత్ జేఏసీ రాష్ట్ర నాయ కుడు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ కార్యాలయం లో విద్యుత్ జేఏసీ దేశవ్యాప్తంగా నిరసనలో భాగంగా జేఏసీ ఆధ్వ ర్యంలో మధ్యాహ్నభోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జేఏసీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో నోయిడా, బొంబాయిలో ప్రైవేటీకరణ చేసినప్పుడు వినియోగదారులకు సరైన సేవలు అందించకపోవడంతో ప్రైవేటీకరణ నిలిచిపోయిందన్నా రు. ఉత్తరప్రదేశ్‌లో ప్రైవేటీకరణ చేస్తామని పిలుపునివ్వగా దేశ వ్యాప్తం గా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో ప్రైవేటీకరణ కార్యక్రమం నిలి చిపోయిందన్నారు. మరోసారి ప్రభుత్వం ముందుకు తెస్తుందని అన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నాయన్నారు. ఉద్యోగులకే కాకుండా ప్రైవేటీకరణ వల్ల ప్రజలకు కూడా నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేందర్, పుడారి గంగాధర్, బాలేష్‌కుమార్, తోటరాజశేఖర్, కాశీనాథ్, నాం పల్లి, అశోక్, మల్లేష్, జాకీర్ అలీ, చెన్నయ్య, ప్రసాద్‌రెడ్డి, రాజేం దర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్, శంకర్‌గౌడ్, సునీత, నాగేష్, సతీష్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మితో తులం బంగారం ఇవ్వాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు శుక్రవారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడబిడ్డ పెళ్లి భారం కాకుం డా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం కింద లక్షా 116 రూపాయలు అందించడం సంతోషంగా ఉందన్నారు. తులం బంగారం కోసం తెలంగాణ బిడ్డలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనికరించడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు విజయోత్సవాల పేరుతో ప్రజాధనం వృధా చేయడం తప్ప రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. చెక్కుల జారీ విషయంలో జాప్యం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న రెండు నెలల కాల వ్యవధిలో చెక్కులు విడుదల చేయాలని ప్రభుత్వానికి అసెంబ్లీలో విజ్ఞప్తి చేస్తామన్నారు. అర్బన్ పరిధిలోని 801 మంది లబ్ధిదారులకు సుమారు 8కోట్ల ఒకలక్షా 92వేల 916 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్పొరేటర్లు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పోయిన బ్యాగును అప్పగించిన రైల్వే పోలీసులు



బ్యాగు అందిస్తున్న రైల్వే పోలీసులు

ఖిల్లా,,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి):రైల్వే స్టేషన్‌లో పోగొట్టుకున్న బ్యాగును సంబం ధిత బ్యాగు యజమానికి రైల్వే పోలీసులు గుర్తించి అందించినట్లు రైల్వే ఎస్ఐ.సాయి రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి... శుక్రవారం ఉదయం రైల్వేస్టేషన్‌లో తని ఖీలు చేస్తుండగా ఒకటో నంబర్ ప్లాట్ ఫాంపై ఓ చోట బ్యాగును పోలీసులు గుర్తించారు. ఆ బ్యాగు కోసం ఎవరైన వస్తారా అని ఎదురు చూశారు. ఎవరు రాకపోయే సరికి పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ఓ వ్యక్తికి చెందిన విలువైన వస్తువులు ఇతరుల చేతిలో పడ కుండా జాగ్రత్తపడి చేరాల్సిన బ్యాగును సదరు వ్యక్తికి అందించారు రైల్వే పోలీసు లు. ఆ బ్యాగును పోలీసు స్టేషన్‌కు తీసు కెళ్లి తెరచి చూడగా అందులో లక్ష 8వేల నగదు, ఒకటిన్నర తులాల బంగారం, అర తులం ఉంగరం, బట్టలు, ఫోన్‌తో పాటు ఏటిఎం కార్డులను పోలీసులు గుర్తించారు. బ్యాగు పోగొట్టుకున్న వ్యక్తి కోసం ఏటీఎం కార్డు ఆధారంగా గుర్తించారు. వెంటనే ఆయనకు సమాచారం అందించారు. జగిత్యాలకు చెందిన మామిడాల నర్సయ్య బ్యాగును అప్పగించారు. బ్యాగులో ఉన్న వస్తువుల వివరాలను నమోదు చేసుకుని అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ కుబేరుడు, కానిస్టేబుల్ సీనానాయక్, ఆర్పీ ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ పాషాలను ఎస్ఐ అభినందించారు.

మీసేవాలో మరిన్ని సర్వీసులు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి 6 రకాల సర్వీసులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌ల నుంచి 2 రకాల సర్వీసులు, మహిళా శిశుసంక్షేమ శాఖ, సీనియర్ సిటీజన్ డిపార్ట్‌మెంట్ నుంచి 1 సర్వీసు మీసేవా ద్వారా అందుబాటులోకి వచ్చాయని ఈ డిస్ట్రిక్ మేనేజర్ కార్తిక్ కుమార్ తెలిపారు. గ్యాప్ సర్టిఫికెట్ (రెవెన్యూ), నేమ్ చేంజ్ ఆఫ్ సిటీజన్ (రెవెన్యూ), లోకల్ క్యాండిడెట్ సర్టిఫికెట్ (రెవెన్యూ), మైనార్టీ సర్టిఫికెట్ (రెవెన్యూ), సర్టిఫికెట్ పునఃజారీ (ఆదా యం, కులం) (రెవెన్యూ), క్రిమిలేయర్ అండ్‌నాన్ క్రిమి లేయర్ సర్టిఫికెట్, సీనియర్ సిటీజన్ మేం టేనెన్స్ తదితర సర్టిఫికెట్లను మీసేవల ద్వారా పొందవచ్చన్నారు. శుక్రవారం యజమానులతో ఆయన గూగుల్‌మీట్ ద్వారా అవగాహన కల్పించారు.

పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

చేస్తుందా ? లేక పాతవారినే కొనసాగిస్తుందా అనే విషయంలో స్పష్ట త లేకపోవడంతో గ్రామాలలో పోటీచేసే ఆశావహులు రిజర్వేషన్ల ఖరారు పై ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే గ్రామాలలో ఓటర్లను ఆకర్షించేందుకు ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ప్రజలకు చేరువయ్యేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారు. జనవరి చివరి వారంలో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో గ్రామ పంచా యతీ ఎన్నికలకు సంబంధించి పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

శబరిమల భక్తుల కోసం ఆర్టీసీ భారీ తగ్గింపు

సుభాష్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని భారీ తగ్గింపుతో కల్పి స్తుందని నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. అయ్య ప్పస్వామి భక్తుల కోసం ప్రత్యేక ప్యాకేజీని కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ స్పెషల్ అద్దె బస్సులపై భారీ తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ రీజియన్‌లోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల నుంచి ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. శబ రిమల కార్యకలాపాల కోసం బస్సుల్లో సీట్లు ఇవ్వకుండా ఇద్దరు వంట మనుషులను ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తున్నామని తెలి పారు. బస్సుల్లో సీట్లు ఇవ్వకుండా ఇద్దరు మణికంఠ స్వాములకు ఉచి తంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. ప్రయాణికుల వస్తువులు తీసుకెళ్లడానికి ఒక అటెండెంట్‌కు సీటు ఇవ్వకుండా ఉచి తం గా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. శబరిమల భక్తుల కోసం ఆర్మూర్ 7382843133, నిజామాబాద్ 9959226022, కామారెడ్డి 7382843747, బోధన్ 9849500725, బాన్సువాడ 94911 05706 నెంబర్ల ను సంప్రదించాలని కోరారు.

ఆన్‌లైన్ పేమెంట్‌తో రిజర్వేషన్...

నిజామాబాద్ నగర ప్రధాన బస్టాండ్‌లో మరో ఆన్‌లైన్ సౌకర్యాన్ని టీజీఎస్ ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొచ్చింది. రిజర్వేషన్ చేసుకునే వారికి ఆన్‌లైన్‌పేమెంట్ చెల్లింపులు అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు రిజర్వేషన్‌కు సైతం ఆన్‌లైన్ చెల్లింపులు అందుబాటులో లేవు. శుక్రవా రం నుంచి ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు నిజామాబాద్ డిపో-1 మేనేజర్ ఆనంద్ తెలిపారు.

17న అండర్-20 బాలుర జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు

సుభాష్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-20 బాలు ర కబడ్డీ ఎంపికలు డిసెంబర్ 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసో సియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగయ్య, గంగాధర్‌రెడ్డిలు తెలిపారు. ముప్కాల్ మండల కేంద్రంలోని భూదేవ్ ఇండోర్ స్టేడియంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల వరకు క్రీడాకారులు మైదానానికి చేరుకోవాలన్నారు. 12-1-2005 ముందు జన్మిం చిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు బరువు 70 కిలోల లోపు మాత్రమే ఉండాలని జనన ధృవీకరణ పత్రం వెంట తెచ్చుకోవా లన్నా రు. ఇందులో ప్రతిభకనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పం పనున్నట్లు తెలిపారు. మిగతా వివరాల కోసం 9618088086 నెం బర్‌ను సంప్రదించాలని కోరారు.

జీవశాస్త్ర పోటీపరీక్షల్లో విజేతగా రావుట్ల విద్యార్థి

సిరికొండ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) సిరికొండలో శుక్రవారం జరి గిన మండలస్థాయి జీవశాస్త్ర పోటీ పరీక్షలో సిరికొండ మండలం రావుట్ల హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచారు. రావుట్ల హైస్కూల్ విద్యార్థులు తెడ్డు రాకేష్ ప్రథమ, ఓరుగంటి రాజేశ్వరి ద్వితీ య విజేతలుగా గెలుపొందారు. వీరిద్దరికి పాఠశాల సముదాయ ప్రధా నోపాధ్యాయులు సతీష్‌కుమార్‌గౌడ్ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సంధ్యారాణి, ఉపాధ్యా యులు పోశెట్టి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఉమాశేఖర్ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.



జీవశాస్త్ర పోటీపరీక్షల్లో విజేతగా నిలిచిన రాకేష్

మహాసభలను జయప్రదం చేయండి

సుభాష్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బహుజన లెఫ్ట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 14, 15 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహి స్తున్నట్లు బీఎల్‌పీ జిల్లా అధ్యక్షురాలు సబ్బని లత తెలిపారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పూలే అంబేద్కర్ నగర్‌లో మహా సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా అధ్యక్షురాలు సబ్బనిలత మాట్లా డుతూ 2018లో భారత ప్రధాన ఎన్నికల కమిషన్ ద్వారా రిజిస్ట్రేషన్ పొందిన బహు జన లెఫ్ట్‌పార్టీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 105 స్థానాలకు పోటీచేసిందని తెలిపారు. రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పోటీ చేస్తుందన్నారు.

PUBLIC NOTICE

General public are hereby in formmed that my client M/S Shriram finance Ltd Bodhan branch, agreed to accord loan to Borrower : RODDA RAVINDAR S/O RODDA SAILU Aged 31 Years OCC:-Business R/o H.No. 3-124/16/A SANGEM VILLAGE BODHAN MANDAL NIZAMABAD DIST Dist, Property holder : RODDA RAVINDAR S/O RODDA SAILU Aged 31 Years OCC-Business R/o H.No 2-73 3-124/16/A SANGEM VILLAGE BODHAN MANDAL Nizamabad Dist, by mortgage of the schedule property mentioned below. The above propective loanee agreed to create fist charge against property mentioned below in favour of my client company. if any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection rasied afterwards shall be deemed to be "Waived" and not binding on my claint company and my client shall proceed futher for according above loan.

Schedule

The Existing Open Plot No. 45 Lies in Land SY NO 125/7 & 125/8 Area of admeasuring 212.08 Sq yards Bellal Tarfa Situated at "VIP Colony" Near Ward No.01; Block No. 01 Rakasipet Area BODHAN Town & Mandal, Nizamabad Dist,The Under the Jurisdiction of Registration Dist Nizamabad Sub Dist Bodhan

Bounded as under.

East: Plot No.46, **West:** Plot No.44, **North:** 30'.0" Wide Road, **South:** Plots of Sri M.A Fassi and Others (Fatima Garden).

K. SUBBA RAO, B.sc. LLB
Advocate, Bodhan, Ph:9440004201


చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.250	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.255	రూ. 280

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79700	రూ.73500	రూ.955

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (10.00, 2.05, 6.10, 10.15)
స్క్రీన్-2 : ఫియర్ (11.15)
: మిస్ యూ (2.20)
: పుష్ప-2 (5.10, 9.15)
స్క్రీన్-3 : ప్రణయ గోదావరి (11.10)
: పుష్ప-2 (2.20, 6.25, 10.30)
స్క్రీన్-4 : పుష్ప-2 (10.00)
: పాని (2.05)
: మిస్ యూ (5.10, 10.35)
: ఫియర్ (8.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : పుష్ప-2 (1.30, 7.00)
స్క్రీన్-2 : మిస్ యూ (10.40, 1.20, 7.50, 10.30)
స్క్రీన్-3 : పుష్ప-2 (11.00, 10.00)



దేవి: పాని (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : పుష్ప-2 (హిందీ) (10.00, 2.00, 6.00, 10.00)
విజయ్: పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్: మిస్ యూ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్